సాక్షి
విజయనగరం

శుక్రవారం । 7 । మార్చి । 2025




నేలమీదనే రాయాలా..!

పదో తరగతి పరీక్షలు మరికొద్దిరోజుల్లో ఆరంభంకానున్నాయి. కొన్ని పరీక్ష కేంద్రాల్లో వసతులు లేకపోవడం విద్యార్థులను ఆవేదనకు గురిచేస్తోంది. - 8లో



భూములు లాక్కుని కడుపు కొట్టొద్దు

మాకు జీవనాధారమైన భూములు లాక్కుని కడుపు కొట్టకండి. అడిగిన ధర ఇవ్వకుండా మా భూములు లాక్కుంటే మేం ఏం కాలని విశాఖ- బొడ్డవర హైవే నిర్వాసితులు వాపోయారు. - 8లో



న్యూస్‌రీల్

రేపు జాతీయ లోక్ అదాలత్



బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి

విజయనగరం లీగల్: ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఈ నెల 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు బి.సాయికళ్యాణ్ చక్రవర్తి కోరారు. రాజీపడదగిన క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాద బీమా, బ్యాంకు చెక్కు బౌన్స్ కేసులు, ప్రాంసరీ నోట్, ఎలక్ట్రిసిటీ, ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పెంపు

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశ దరఖాస్తుకు ఈ నెల 13 వరకు గడువు పెంచినట్టు గురుకులాల సమన్వయకర్త శంబాన రూపవతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదోతరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు 'ఏపీపీఆర్ఏజీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్లకు ప్రశంసలు



డ్రైవర్లను అభినందిస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రం నుంచి ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళాకు వెళ్లిన భక్తులకు సురక్షిత ప్రయాణ సేవలందించిన ఆర్టీసీ బస్సు డ్రైవర్లను జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ అభినందించారు. ప్రయాణికుల విశేష ఆదరణ పొందిన ఐదుగురు డ్రైవర్లకు జ్ఞాపికలు, బహుమతులను ఆర్టీసీ డిపో ప్రాంగణంలో గురువారం అందజేశారు. కుంభమేళాకు నడిపిన ఐదు బస్సుల నుంచి రూ.12లక్షల వరకు ఆదాయం సమకూరిందని డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో డీపీసీఐ ఆదినారాయణ, డిపో సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా మద్యం షాపుల లాటరీ ప్రక్రియ



డీఆర్వో శ్రీనివాసమూర్తి సమక్షంలో సాగుతున్న లాటరీ ప్రక్రియ

విజయనగరం అర్బన్: జిల్లాలో గీత/సొండి కులాలకు కేటాయించిన మద్యంషాపుల కోటా లాటరీ ప్రక్రియ విజయనగరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం సజావుగా సాగింది. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి సమక్షంలో సంబంధిత కులాల కోటాగా 16 షాపులను కేటాయించారు. షాపుల కోసం 308 దరఖాస్తులు నమోదు కాగా వీటి ఫీజుల రూపంలో రూ.6.16 కోట్లు లభించిందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాధుడు తెలిపారు. 16 మద్యం షాపులకు మొదటి విడత లైసెన్స్‌ఫీజు రూపంలో రూ.84.50 లక్షల ఆదాయం వచ్చిందన్నారు.

ఈ నెల 8 నుంచి పీ-4 సర్వే

విజయనగరం అర్బన్: పబ్లిక్ ప్రైవేటు పీపుల్స్ పార్టిసిపేషన్ (పీ-4) సర్వేను ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు జరుగుతుందని కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. సచివాలయ, గ్రామ స్థాయిలో పనిచేసే సిబ్బంది సర్వేలో పాల్గొంటారని, ఎంపీడీఓలు పర్యవేక్షణ అధికారులుగా వ్యవహరించాలని సూచించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఆధ్వర్యంలో పీ-4 సర్వేపై ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేకాధికారులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీరో పేదరికమే లక్ష్యంగా ప్రభుత్వం పీ-4 కార్యక్రమాన్ని తలపెట్టిందన్నారు. పేదరికంలో ఉన్న 20 శాతం మందికి వివిధ రకాలుగా తోడ్పాటునందిస్తుందన్నారు. ఈ నెల 21, 22తేదీల్లో గ్రామ సభలను నిర్వహించి, 27వ తేదీన తుది నివేదిక అందజేయాలని, ఉగాది సందర్భంగా 30న ముఖ్యమంత్రి చంద్రబాబు పాలసీని ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.



రామభద్రపురం రోడ్డులో కురుస్తున్న పొగమంచు

ఉదయం మంచు... తర్వాత మంట

గత వారం రోజులుగా జిల్లాలో భిన్నమైన వాతావరణం నెలకొంది. ఉదయం 8 గంటల వరకు మంచు దుప్పటి కప్పేస్తోంది. చలి వణికిస్తోంది. 10 గంటల తర్వాత ఎండ దారెత్తిస్తోంది. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడేలా భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. మధ్యాహ్నం 12 గంటలకు రోడ్లన్నీ నిర్మానుష్యమవుతున్నాయి. అత్యవసర వేళ రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. మార్చి నెలలోనే ఇలా ఉందని... మే నెల ఎండలను తలచుకుని భయాందోళన చెందుతున్నారు.

– రామభద్రపురం



మధ్యాహ్నం 12 గంటలకు నిర్మానుష్యమైన రామభద్రపురం అంతరరాష్ట్ర కూడలి రోడ్డు (ఇన్‌సెట్లో) ఎండ నుంచి రక్షణగా తలపై కొంగు వేసుకుని ముందుకు సాగుతున్న మహిళలు

రైస్ కార్డు... పేద, మధ్య తరగతి కుటుంబాలకు అతి విలువైనది. రేషన్ సరుకులతో పాటు పిల్లల చదువులకు ఆర్థిక సాయం, ప్రభుత్వ రాయితీలు మంజూరుకు ఆ కార్డే ఆధారం. ఏడాదిగా కొత్త కార్డులు మంజూరు కాక.. పిల్లల పేర్లు కార్డులో చేర్పించే అవకాశం లేక.. ప్రభుత్వ ప్రయోజనాలు అందక పేద ప్రజలు మనోవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వం ఆరు నెలలకోసారి కొత్త కార్డులు మంజూరు చేసేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా ఒక్క కార్డు కూడా మంజూరు చేయకపోవడంపై మండిపడుతున్నారు. మంచి చేస్తామని చెప్పి ముంచేస్తోందని విమర్శిస్తున్నారు.



కార్డు రాదు.. సరుకులు అందవు

'గంట్యాడ మండలం పెదవేమలి గ్రామానికి చెందిన జి.చిన్నమ్మలు 2024 మార్చి 4వ తేదీన రైస్ కార్డు కోసం దరఖాస్తు చేశారు. ఏడాదిగా ఎదురుచూస్తున్నా ఇంతవరకు ఆమెకు రైస్ కార్డు మంజూరు కాలేదు.'

గంట్యాడ మండలానికి చెందిన వి.భీమేశ్వరావు తన భార్య, పిల్లలను రైస్ కార్డులో చేర్చడానికి 2024 ఫిబ్రవరి 7వ తేదీన దరఖాస్తు చేసుకున్నారు. ఇంతవరకు రైస్ కార్డులో అతని కుటుంబ సభ్యుల పేర్లు చేరలేదు. రేషన్ సరుకులు అందడం లేదు.

- కొత్త కార్డులు మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- దరఖాస్తు చేసుకునేందుకూ అవకాశం లేని పరిస్థితి
- జిల్లాలో 10 వేల మంది ఎదురుచూపు
- సంక్షేమ పథకాలు, చదువు పత్రాలకు ఇబ్బందులు

విజయనగరం ఫోర్ట్:

ప్రజా సంక్షేమమే ప్రధానమన్నారు.. సూపర్ సిక్స్‌తో ఊరించారు.. హామీల వర్షం కురిపించారు.. తీరా అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నారంటూ కూటమి నేతల తీరుపై జనం మండిపడుతున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆధారమైన రైస్‌కార్డుల మంజూరులో ప్రభుత్వ అలసత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. దరఖాస్తు చేసుకుని నెలలు తరబడుతున్నా కొత్తకార్డులు మంజూరు చేయకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2024 మార్చి15వ తేదీ వరకు జిల్లాలో కొత్త రైస్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు, సభ్యులను రైస్ కార్డులో చేర్చడానికి, కార్డులు విభజనకు అవకాశం ఉండేది. సచివాలయంలో దరఖాస్తులు స్వీకరించేవారు. ఆ తర్వాత నుంచి ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క రైస్‌కార్డు కూడా మంజూరు కాలేదు. వేలాది జంటలు కొత్తకార్డుల కోసం ఎదురుచూస్తున్నా ఫలితం లేకపోయింది. రైస్ కార్డుల్లో కుటుంబ సభ్యులు పేర్లు చేర్పించేందుకు అవకాశం లేకపోవడంతో ఎలాంటి ప్రయోజనాలు అందడం లేదు.

దరఖాస్తు చేసిన వెంటనే...


గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కొత్త రైస్ కార్డుల మంజూరు, పిల్లల పేర్లు చేర్పించడం, కార్డుల విభజన కోసం నిరంతరాయంగా దరఖాస్తులు స్వీకరించేది. ప్రతీ ఆరు నెలలకోసారి కొత్త కార్డులు మంజూరు చేసేది. పిల్లల పేర్లు, కార్డుల విభజన పనులు దరఖాస్తు చేసిన వెంటనే సచివాలయ సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకెళ్లి చక్కబెట్టేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని వాపోతున్నారు. రేషన్ సరుకుల సరఫరా, ఫీజురీయింబర్స్ మెంట్ వంటి పథకాల భారాన్ని తగ్గించుకునేందుకే కొత్త కార్డులు మంజూరు చేయడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొత్తకార్డులు మంజూరు కాలేదు

జిల్లాలో కొత్తగా రైస్ కార్డులు ఎవరికీ మంజూరు కాలేదు. కొత్త రైస్ కార్డు కోసం, రైస్ కార్డులో సభ్యుల పేర్లు చేర్చడానికి ప్రభుత్వం నుంచి ఇంకా ఆప్షన్ రాలేదు.

– కె.మధుసూదనరావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

జిల్లా వ్యాప్తంగా 10 వేల మంది ఎదురు చూపు



చిన్నమ్మలు రైస్ కార్డు కోసం దరఖాస్తు చేసిన స్లిప్

జిల్లా వ్యాప్తంగా సుమారు 10 వేల మంది కొత్త రైస్ కార్డులు, రైస్ కార్డుల విభజన, సభ్యుల పేర్లు చేర్చడం కోసం ఎదురు చూస్తున్నారు. 9 నెలలుగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోతోంది. దరఖాస్తు చేసుకునే ఆప్షన్ లేదని సచివాలయ సిబ్బంది చెబుతుండడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. పింఛన్లు, ఇళ్లు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ తదితర ప్రయోజనాల కోసం రైస్ కార్డు తప్పనిసరని, కార్డుల మంజూరులో కూటమి ప్రభుత్వ అలసత్వం తగదంటూ బహిరంగంగా విమర్శిస్తున్నారు.

ఏపీసీ పరిశోధనకు పేటెంట్ హక్కు



పేటెంట్ హక్కు పత్రంతో ఏపీసీ రామారావు

విజయనగరం అర్బన్: జిల్లా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త (ఏపీసీ) డాక్టర్ ఎ.రామారావు రూపొందించిన 'పోలిమర్ పుల్లీ డ్రైవెన్ సెంట్రీఫ్యూగల్ పంపు'నకు కేంద్ర ప్రభుత్వ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ శాఖ నుంచి పేటెంట్ హక్కు లభించింది. ఈ మేరకు ఆ శాఖ నుంచి ధ్రువీకరణ పత్రం అందినట్టు తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామారావు వెల్లడించారు. డాక్టర్ ఎన్‌టీఆర్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ కోర్సుగా 2014 నుంచి 2017 సంవత్సరం వరకు పరిశోధించిన ఆ పరికరానికి పేటెంట్ హక్కు లభించిందని వివరించారు. పూర్తిగా ప్లాస్టిక్ వినియోగంతో తక్కువ బరువు, తక్కువ వ్యయంతో పదేళ్లపాటు శ్రమించి పంపింగ్ పరికరాన్ని తయారుచేసినట్టు తెలిపారు. పరికరానికి 20 సంవత్సరాలకు పేటెంట్ హక్కు లభించిందన్నారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కలిసి అభినందనలు అందుకున్నారు.

జ్వరాలకు కారణాలు విశ్లేషించాలి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకరరావు



ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్న గిరిజన చిన్నారిని పరామర్శిస్తున్న ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకరరావు

శృంగవరపుకోట: మండలంలోని ధారపర్తి పంచాయతీ పరిధిలో జ్వరాలు విజృంభిస్తున్నాయన్న వార్తపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు స్పందించారు. ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి గురువారం చేరుకుని జ్వరాలతో చికిత్స పొందుతున్న గిరిజన చిన్నారులను పరామర్శించారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. వైద్యసేవలపై ఆరా తీశారు. జ్వరాలకు కారణాలు అన్వేషించి నివారణ చర్యలను వేగవంతంగా చేపట్టాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట ఎస్టీ కమిషన్ మెంబర్ కొర్రా రామలక్ష్మి ఉన్నారు.

చల్లని తల్లి ఎల్లారమ్మ

- జముకుల పాటతో జాతర ఆరంభం
- తెల్లవార్లూ జాతరే జాతర



ఎల్లారమ్మ తిరువీధి



చిన్నారుల కోలాట ప్రదర్శన

శృంగవరపుకోట:

'ఎంత చల్లని తల్లి ఎల్లారమ్మ..
బ్రాహ్మణ పిల్లవే బంగారు బొమ్మ..
మర్రి ఆకుల పానుపే మా అమ్మకి..
వింజామరలు వీచరే మా తల్లికి.' అంటూ జముకుల పాటల మధ్య ఎల్లారమ్మ గంభీరంగా కదిలింది. మూడు రోజుల ఎల్లారమ్మ జాతరకు ఊరూవాడ ఏకం అయ్యింది. జామి గ్రామం కాస్త జనసంద్రమైంది. ఎటు చూసినా భక్తుల కోలాహలం.. ఆధ్యాత్మిక వాతావరణం.. సాంబ్రాణి పరిమళం.. అమ్మను చూడాలన్న ఆర్తితో జనంకదిలి రాగా ఎల్లారమ్మ జాతర జన జాతరను తలపించింది. గురువారం నిర్వహించిన అమ్మవారి తొలేళ్ల ఉత్సవం అంగరంగా వైభవంగా సాగింది. డప్పుల మోతల నడుమ కళారూపాలు కదిలాయి. సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

ముహూర్తం ప్రకారం..

జామి చుక్కవీధిలో ఉన్న గద్దె ఇంటి వద్ద ఎల్లారమ్మ తల్లి ప్రభను ముహూర్తం ప్రకారం రాత్రి 10.30 గంటలకు గద్దెదించారు. అమ్మవారికి పూజాధికాలు నిర్వహించి చీరసారెలు సమర్పించారు. తల్లి ఊరేగింపునకు అంకురార్పణ చేశారు. జముకుల పాట నడుమ ఎల్లారమ్మ తిరువీధి సాగింది. అర్చకులు, బ్రాహ్మణులు, గ్రామస్తులు అమ్మవారికి పూజలు చేసి, చీర సారెలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. అమ్మవారి తిరువీధి ఆలయం వరకు వేడుకగా సాగింది. వేకువజామును 3 గంటలకు అమ్మవారు ఆలయానికి చేరుకునేవేళ బాణసంచా వెలుగులు భక్తులను ఆకట్టుకున్నాయి.

జంతు బలులు లేని జాతర...

ఎల్లారమ్మ తల్లి జాతరలో ఎటువంటి జంతు బలులు ఇవ్వరు. దర్శనానికి వచ్చే భక్తులు పడికట్టు ఇస్తారు. బియ్యం, ఉలవలు, పెసలు, పసుపు-కుంకుమలు, కర్ర భరిణెలు పడిగా కట్టుకొచ్చి అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు.

దేవదాయశాఖ భూముల పరిరక్షణే ధ్యేయం



- దేవదాయశాఖ జిల్లా సహాయ కార్య నిర్వహణాధికారి శిరీష

విజయనగరం టౌన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న దేవదాయశాఖ భూముల పరిరక్షణే ధ్యేయమని ఆ శాఖ జిల్లా సహాయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. విజయనగరంలోని దేవదాయశాఖ కార్యాలయంలో ఆమె గురువారం మాట్లాడారు. జిల్లాలో దేవదాయశాఖ పరిధిలో 9,900 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. వాటిలో నాలుగువేల ఎకరాల వరకు ఆక్రమణలో ఉన్నట్టు వెల్లడించారు. శిస్తుల రూపంలో 2వేల ఎకరాల భూములకు రూ.50 లక్షలు, ఆస్తుల లీజుల వల్ల రూ.57 లక్షల ఆదాయం సమకూరుతోందని తెలిపారు. జిల్లాలో 473 ఆలయాల రిజిస్టరై ఉన్నాయని, భూములున్న దేవాలయాలు 313కాగా, 165 ఆలయాలు మాత్రమే కార్యనిర్వహణాధికారుల చేతుల్లో ఉన్నట్టు వెల్లడించారు. జిల్లాలో బొబ్బిలి, రాజాం, ఎస్.కోట, కొత్తవలస, వీరభద్రపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి శిస్తులు చెల్లించాలని రైతులకు చెప్పామన్నారు.

పన్నుల చెల్లింపులో నెల్లిమర్ల ఫస్ట్

- పట్టణాల్లో ఆస్తి పన్ను వసూళ్లలో అధికారులు బిజీ
- 73.96 శాతం వసూళ్లతో నెల్లిమర్ల నగర పంచాయతీ ముందంజ
- నాలుగు పట్టణాల్లో పన్ను డిమాండ్ రూ.51.37 కోట్లు
- ఇప్పటివరకు వసూలైనది రూ.28.56 కోట్లు
- బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్న యంత్రాంగం

విజయనగరం:

ఆస్తి పన్ను చెల్లింపులో నెల్లిమర్ల నగరపంచాయతీ ప్రజలు జిల్లాలో ముందంజలో ఉన్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు గడువు (మార్చి 31) దగ్గర పడుతుండడంతో ఆస్తి పన్ను వసూళ్లలో కార్పొరేషన్, మున్సిపల్, నగర పంచాయతీ అధికారులు నిమగ్నమయ్యారు. మొండిబకాయిల వసూళ్లే లక్ష్యంగా నోటీసులు జారీ చేస్తున్నారు. పన్నులు చెల్లించి పట్టణాల అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నారు. విజయనగరం జిల్లా పరిధిలోని విజయనగరం కార్పొరేషన్‌తో పాటు బొబ్బిలి మున్సిపాలిటీ, నెల్లిమర్ల, రాజాం నగర పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి డిమాండ్ రూ.51.37 కోట్లు కాగా ఇప్పటివరకు రూ.28.56 కోట్లు వసూలు చేశారు. మొత్తం డిమాండ్‌లో 55.59 శాతం మున్సిపల్ ఖజానాకు చేరింది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు మొదటి విడత, అక్టోబర్ నుంచి మార్చి వరకు రెండో విడతగా పన్నులు వసూలు చేయడం సహజం. ఇప్పటి వరకు నెల్లిమర్ల నగర పంచాయతీ 73.96 శాతం వసూళ్లు చేసి మొదటి స్థానంలో నిలవగా.. 60.91 శాతం వసూళ్లతో బొబ్బిలి మున్సిపాలిటీ రెండవ స్థానంలో, 59 శాతం వసూళ్లతో రాజాం మూడవ స్థానంలో, 53.95 శాతం వసూళ్లతో విజయనగరం కార్పొరేషన్ చివరి స్థానంలో ఉంది. నీటిపన్ను వసూళ్లలో సైతం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేదు. సిబ్బందిపై ఉన్నతాధికారులు ఒత్తిడి పెంచడంతో క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి పన్నుల వసూళ్లకు శ్రీకారం చుట్టారు.

ప్రాంతం	భవనాల సంఖ్య	పన్ను డిమండ్	వసూలైనది	శాతం
విజయనగరం	70,413	రూ.41.15కోట్లు	రూ.22.20 కోట్లు	53.95
బొబ్బిలి	12,949	రూ.5.53 కోట్లు	రూ.3.37 కోట్లు	60.91
రాజాం	12,289	రూ.3.22కోట్లు	రూ.1.90 కోట్లు	59.00
నెల్లిమర్ల	5,452	రూ.1.48కోట్లు	రూ.1.10కోట్లు	73.96



పన్ను బకాయిదారుల జాబితాను సచివాలయంలో ప్రదర్శిస్తున్న సిబ్బంది

● బకాయిదారులపై కొరడా..

ఆర్థిక సంవత్సరం ముగింపు గడువు దగ్గర పడుతుండడంతో పన్నుల వసూలుకు బకాయిదారులపై అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. మొండి బకాయిదారుల జాబితాను సిద్ధంచేసి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. అప్పటికీ స్పందించకుంటే ఇంటికి వేసిన తాగునీటి కుళాయి కనెక్షన్లను తొలగిస్తున్నారు. పన్ను బకాయి దారుల జాబితాలను కార్పొరేషన్/మున్సిపల్ కార్యాలయాలతో పాటు అన్ని సచివాలయాల్లో ప్రదర్శిస్తున్నారు. దీర్ఘకాలికంగా బకాయిపడిన వారి దుకాణాలను సీజ్ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పన్నుల వసూళ్లపై యంత్రాంగం ఒత్తిడి చేస్తోందన్న చర్చ పట్టణాల్లో సాగుతోంది.

పన్నులు చెల్లించాలి



స్థానిక సంస్థల అభివృద్ధికి పన్నుల ద్వారా వచ్చే ఆదాయమే కీలకం. ఆదాయం వస్తేనే అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుంది. ఆర్థిక సంవత్సరం ముగింపు గడువు దగ్గర పడుతోంది. ప్రజలంతా సహకరించి పన్ను బకాయిలు చెల్లించాలి. ఆన్‌లైన్‌లోను, మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో పన్ను చెల్లించి రసీదు పొందాలి. లేని పక్షంలో మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– పల్లి నల్లనయ్య, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

పోలవరం ప్రధాన కాలువ భూసేకరణకు ఆదేశం



కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో పోలవరం ప్రధాన కాలువ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. తన చాంబర్‌లో జలవనరుల శాఖ, భూసేకరణ అధికారులతో గురువారం సమీక్షించారు. పోలవరం ప్రధాన కాలువ భూసేకరణ చేయాల్సిన గ్రామాల్లో భూముల విలువలను సేకరించే పనిని వెంటనే చేపట్టాలన్నారు. 59 గ్రామాల్లో 3,314 ఎకరాల భూమి అవసరమని జలవనరులశాఖ గతంలో ప్రతిపాదనలు పంపించిందన్నారు. తాజాగా ఏప్రిల్ 1 నాటికి ఉన్న భూముల ధరల ప్రకారం భూసేకరణకు అయ్యే వ్యయాన్ని అంచనా వేయాలని సూచించారు. భూసేకరణ అధికారులు, సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ఈఈ ఉమేష్‌చంద్ర కుమార్, భూసేకరణ అధికారి సూకరాజు, ప్రధాన కాల్వ నిర్మాణ సంస్థ ప్రతినిధి లక్ష్మణప్రసాద్, డీఏఓ పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

8న సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కేవీ ప్రభావతి గురువారం తెలిపారు. నగరంలోని సిటీ క్లబ్ ఆవరణలో ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో 16 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండి 55 కేజీల బరువు కలిగిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. జిల్లా జట్ల ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు కడప జిల్లాలో జరగబోయే అంతర్ జిల్లాల పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం కల్పించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తిగల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9949721949 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్



గంజాయి స్వాధీనం చేసుకుని తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

నెల్లిమర్ల: గంజాయి లావాదేవీలు చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై బి.గణేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒడిశాలోని రాయగడ నుంచి గంజాయిని నెల్లిమర్ల పట్టణంలోని చంపావతి నది తీరంలో థామస్ పేట గ్రౌండ్ వద్దకు తరలిస్తున్న వ్యక్తి, దానిని కొనుగోలు చేసిన వ్యక్తిని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నెల్లిమర్లకు చెందిన వ్యక్తి గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో వినియోగ దారులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. వారిద్దరి దగ్గర సుమారు ఒక కేజీ 160 గ్రాముల గంజాయిని సీజ్ చేసి అరెస్టు చేసినట్లు చెప్పారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



కర్రి ప్రసాద్ (ఫైల్)

పార్వతీపురం రూరల్: మండలంలోని జమ్మిడివలస గ్రామానికి చెందిన కర్రి ప్రసాద్(39) రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి గురువారం మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి మృతుడి బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరీక్ష నిమిత్తం విజయవాడ వెళ్లి తిరిగి స్వగ్రామానికి ట్రైన్‌లో వస్తుండగా మార్గ మధ్యంలో అనకాపల్లి వద్ద ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడు ఆర్మీలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశాడు. కుటుంబ పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి ..





ప్రసాద్ వర్మ మృతదేహం

రామభద్రపురం: మండలం పరిధిలోని తారాపురం టీకాల లచ్చన్న గుడి వద్ద గురువారం రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతిచెందగా మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రామ్ గోపాల్ గౌతం, సాన్వర్ ప్రసాద్ వర్మ స్నేహితులు. వారిద్దరూ కొన్ని నెలల క్రితం జీవనోపాధి కోసం సాలూరుకు వచ్చి కొత్తభవనాలకు పుట్టీలు, సీలింగ్‌లు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఉత్తరప్రదేశ్‌లోని సాతూరుకు వెళ్తానని బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో డ్రాప్ చేయమని రామ్‌గోపాల్‌ను ప్రసాద్ వర్మ కోరడంతో ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంపై బొబ్బిలి రైల్వేస్టేషన్‌కు బయల్దేరి వెళ్తున్నారు. సరిగ్గా తారాపురం టీకాల లచ్చన్న గుడి వద్దకు వచ్చే సరికి వారికంటే ముందుగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న అనకాపల్లి జిల్లా రామవరం గ్రామానికి చెందిన రామదాసు సొంతూరుకు వెళుతూ గుడిలో అమ్మవారిని దర్శించుకుందామని బైక్ స్లో చేశాడు. ఇంతలో వెనకనుంచి వస్తున్న ఇద్దరు స్నేహితులు ముందున్న బైక్‌ను ఢీకొట్టడంతో బైక్ వెనుక కూర్చున్న ప్రసాద్ వర్మ(42) ప్రమాదవశాత్తు తుళ్లిపోయి రోడ్డు దెబ్బతిన్నాడు. దీంతో తలకు తీవ్రగాయం కాగా, రామ్‌గోపాల్ గౌతమ్‌కు, రామదాసుకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్సై వి.ప్రసాదరావు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రథమ చికిత్స నిమిత్తం గాయపడిన ముగ్గురిని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడికి చేరుకునే సరికి ప్రసాద్ వర్మ మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు ఎస్సై ప్రసాదరావు కేసే నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేలమీద నే రాయాలా..!

- సమస్యల్లో పదోతరగతి పరీక్షా కేంద్రాలు
- కూర్చుని రాసేందుకు బల్లలు, తాగేందుకు నీరులేని పరిస్థితి
- గదులలో ఫ్యాన్‌లు, బాయ్స్‌కు బాత్‌రూమ్ సదుపాయం కరువు
- జిల్లావ్యాప్తంగా 119 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న విద్యార్థులు 23,774 మంది
- సమీపిస్తున్న పరీక్షలు
- విస్తుపోతున్న విద్యార్థులు



పాఠశాలలో తరగతి గదిలో బల్లలు లేక నేలపై కూర్చుని చదువుతున్న విద్యార్థులు



రామభద్రపురం పరీక్ష కేంద్రం ఉన్నత పాఠశాల

రామభద్రపురం:

పదో తరగతిలో అత్యధిక ఉత్తీర్ణత శాతం కోసం విద్యాశాఖ 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తోంది. అందుకనుగుణంగా ఉపాధ్యాయులు సిలబస్ పూర్తి చేశారు. విద్యార్థులు రేయింబవళ్లు కష్టపడి చదువుతున్నారు. అయితే మా పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలి. అందరూ ఉత్తమ మార్కులు పొందాలనే ఆలోచనే తప్ప..విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయా? లేదా? అని కనీస ఆలోచన చేయడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, అంతులేని నిర్లక్ష్యం చూపుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లావాప్తంగా 119 పరీక్ష కేంద్రాల్లో 447 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలకు చెందిన 22,939 మంది, గతంలో ఫెయిలైన విద్యార్థులు 835 మంది మొత్తం 23,774 మంది పరీక్షలు రాయనున్నారు.

పదోతరగతే కీలకం

పదో తరగతి ప్రతి విద్యార్థి జీవితంలో ఎంతో కీలకం. పదో తరగతిలో సాధించిన మార్కులే ఉన్నత విద్య, ఉద్యోగాల కోణంలో ప్రతి దశలోనూ పరిగణనలోకి తీసుకుంటున్నారు. అయితే ఉత్తమ మార్కులు సాధించాలంటే పరీక్షల కోసం బాగా చదవాలి. అలాగే చదివింది బాగా రాయాలంటే పరీక్ష రాసే గదిలో ప్రశాంత వాతావరణం ఉండాలి. ఈ నెల 17 నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఆరంభం కానున్నాయి. ఈ పరీక్షలను విద్యార్థులు కూర్చుని రాసేందుకు బల్లలు, తాగునీరు, ఆ గదిలో ఫ్యాన్ వంటి కనీస మౌలిక సదుపాయాలు అవసరం. విద్యార్థి పరీక్ష రాసేటప్పుడు ఎంత బాగా సదుపాయం ఉంటే అంత బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించగలడు. విద్యాలయాలు వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నా..అత్యధిక మార్కులు రావాలన్నా ఆయా పరీక్ష కేంద్రాల్లో వారు పరీక్ష రాసేందుకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు ఉండాలి. పలు పరీక్ష కేంద్రాలలో కనీస సదుపాయాలు లేవు. అందుకు నిదర్శనం రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే పరీక్ష కేంద్రం. ఇక్కడ సుమారు పది తరగతి గదులలో 250 మంది వరకు పరీక్షలు రాయనున్నారు. ఈ కేంద్రంలో విద్యార్థులు కూర్చుని పరీక్ష రాసేందుకు దాదాపు 120 బల్లలు అవసరం. పరీక్షలు ఇంకా పట్టుమని పది రోజులు కూడా లేవు. ఇప్పటివరకు ఒక్క గదిలో కూడా ఒక్క బెంచీ సమకూర్చిన పాపాన పోలేదు. ఒక్కగదిలో కూడా ఫ్యాన్ తిరగడం లేదని విద్యార్థులు చెబుతున్నారు.అలాగే ప్రశ్నపత్రాలు నేడో రేపో పోలీస్ స్టేషన్లకు రానున్నాయి. ఆ ప్రశ్న పత్రాలు భద్రపరిచేందుకు ట్రంకుపెట్టెలు అవసరం. వాటిని ఇప్పటివరకు సమకూర్చనట్లు తెలిసింది.

తనిఖీలు తప్ప చర్యలు శూన్యం

చాలా రోజుల క్రితం త్రిమెన్ కమిటీ వచ్చి పరీక్ష కేంద్రాలను పరిశీలించి వెళ్లింది. అలాగే ఇటీవల పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ తనిఖీచేసి వెళ్లారు. అయితే తనిఖీలు తప్ప తక్షణ చర్యలు లేవు. పరీక్షలు నిర్వహించే బాధ్యత ఎంఈవోలదేనని, వారే మౌలిక వసతులు సమకూర్చుతారని పాఠశాల యాజమాన్యం చూస్తోంది. అలాగే వేరే పాఠశాలల నుంచి 120 బల్లలు తేవడానికి, తిరిగి పంపించడానికి సుమారు రూ.25 వేల వరకు రవాణా ఖర్చులు అవుతున్నాయని, ఆ నిధులు ఎవరిస్తారని భావిస్తున్నట్లు తెలిసింది. పాఠశాల యాజమాన్యమే వసతులు సమకూర్చుతుంది. మాకేటి సంబంధం అన్న భావనలో ఎంఈవోలు ఉన్నట్లు సమాచారం. అయితే పరీక్షలు సమీస్తున్నాయి.ఇప్పటికీ వసతులు సమకూర్చలేదు.ఏమవుతుందో వేచి చూడాలి మరి.



ఇటీవల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఎస్ రామారావు

హెచ్‌ఎం వసతులు సమకూర్చుతామన్నారు



త్రిమెన్ కమిటీ పాఠశాలను సందర్శించి పరీక్ష కేంద్రాల మౌలిక సదుపాయాలపై ఆరా తీసింది. అప్పట్లో పరీక్షల సమయానికి తాము సమకూర్చుతామని పాఠశాల హెచ్‌ఎం కామేశ్వరరావు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు.సమకూర్చాల్సిన బాధ్యత ఆయనదే.

ఎ.తిరుమలప్రసాద్, ఎంఈవో, రామభద్రపురం

పోక్సో కేసు నమోదు

బొండపల్లి: మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలుడు మరో గ్రామానికి చెందిన బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు బాధిత బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. బాలికతో పాటు బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్వహించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

హోమ్‌గార్డు కుటుంబానికి పోలీస్ శాఖ 'చేయూత



మృతిచెందిన హోమ్‌గార్డ్ కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్‌శాఖలో పని చేసి, ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన హోమ్‌గార్డు కుటుంబానికి పోలీస్ శాఖ చేయూత అందించింది. ఈ మేరకు ఎస్పీ వకుల్ జిందల్ తన కార్యాలయంలో గురువారం హోమ్ గార్డు కుటుంబానికి సుమారు రూ.3 లక్షల చెక్కును అందజేశారు. ఏడాది పొడవునా హోమ్‌గార్డు సిబ్బంది పోగు చేసిన ఒక్క రోజు డ్యూటీ అలవెన్స్ చెక్కును జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డు భార్య వి.సత్యవతికి ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, హోమ్‌గార్డ్స్ ఇన్‌చార్జ్ ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్, డీపీఓ సూపరింటెండెంట్ ఏఎస్వీ ప్రభాకరరావు, పోలీసు కుటుంబసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ హౌస్‌తో పోలీస్ వ్యవస్థపై అవగాహన

- ఎస్పీ మాధవ్ రెడ్డి



ఆయుధాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



అబ్బుర పరిచిన జాగిలాల విన్యాసం

పార్వతీపురం రూరల్: మహిళ సాధికార వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని చాకలి బెలగాంలో ఉన్న పోలీస్‌శాఖ మల్టీఫంక్షన్ హాల్ ఆవరణంలో గురువారం ఓపెన్ హౌస్ ఫర్ ఉమెన్ కార్యక్రమాన్ని జిల్లా పోలీస్‌శాఖ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఎస్పీ మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతే ప్రాధాన్యంగా పోలీసుశాఖ నిరంతరం పనిచేస్తుందని మార్చి 8వ తేదీన జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళ సాధికార వారోత్సవాలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. పోలీస్‌శాఖ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వినియోగించే ఆయుధాలను, పోలీస్‌శాఖలో కీలకమైన సాంకేతిక వ్యవస్థను, నేరస్థలంలో సాక్ష్యాలను సేకరించేందుకు క్లూస్‌టీమ్ ఉపయోగించే పరికరాలు, డాగ్‌స్క్వాడ్ పనితీరును కార్యక్రమంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి కళాశాల విద్యార్థినులు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీస్‌సిబ్బంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్పీ స్వయంగా కొన్ని ఆయుధాలు వినియోగించే పద్ధతులను మహిళలకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన జాగిలాల విన్యాసాలు చూపరులను అబ్బురపరిచాయి. కార్యక్రమంలో ఏఎస్పీ అంకిత సురానా, డీఎస్పీ థామస్ రెడ్డి, ఆర్ఐలు రాంబాబు, నాయుడు, టౌన్ సీఐ మురళీధర్, రూరల్ ఎస్సై సంతోషి, శాఖాపరమైన సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరులోగా వక్ఫ్ ఆస్తుల సర్వే

విజయనగరం అర్బన్: జిల్లాలోని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, దీనిలో భాగంగా ఈ నెలాఖరులోగా స్థలాల సర్వేను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లా స్థాయి వక్ఫ్ పరిరక్షణ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ చాంబర్‌లో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో వక్ఫ్ స్థలాల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వక్ఫ్ స్థలాలు అన్యాక్రాంతం అవకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లాలో మైనారిటీ సంక్షేమశాఖ రికార్డుల ప్రకారం మొత్తం 96 వక్ఫ్ స్థలాలను గుర్తించినట్లు చెప్పారు. మొత్తం ఆ స్థలాల వివరాలను వెంటనే సంబంధిత ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లకు అందజేయాలని వక్ఫ్, మైనారిటీ శాఖాధికారులకు సూచించారు. అలాగే ఇవే కాకుండా రెవెన్యూ, టౌన్ రికార్డుల్లో ఉన్న మొత్తం వక్ఫ్ స్థలాల వివరాలను సేకరించి, వాటిని సర్వే చేసి, నమూనా పటాలతో సహా ఈ నెలాఖరుకు అందజేయాలని, అనంతరం ఈ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్‌కు పేర్లు నమోదు చేసుకోవాలి

వీడియో వీక్షించేందుకు స్కాన్ చేయాల్సి క్యూఆర్ కోడ్

పార్వతీపురం: నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు యువత తమ వివరాలను నమోదు చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా కె. వెంకట్ ఉజ్వల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని, యువత మేధాశక్తిని ఉపయోగించడంలో ప్రపంచంలో కెల్లా మన దేశం ప్రథమ స్థానంలో ఉండాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంకల్పిస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 25ఏళ్ల వయస్సు కలిగిన వారు ఈ యూత్ పార్లమెంట్ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. యువత మై భారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని తరువాత ఒక్క నిమిషం నిడివి కలిగిన ''వాట్ డజ్ వికసిత్ భారత్ మీన్ టూ యూ'' అనే అంశంపై వీడియో చేసి మార్చి 9 అర్ధరాత్రిలోపు మై భారత్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. స్క్రీనింగ్ చేసి జిల్లా స్థాయిలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో వన్‌నేషన్, వన్ ఎలక్షన్, పేవింగ్ ది వేఫర్ వికసిత్ భారత్ అనే అంశంపై మూడు నిమిషాలు మాట్లాడాలని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సంస్థ రూపొందించిన వీడియోను వీక్షించేందుకు క్యూఆర్‌కోడ్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలియజేశారు.

భూములు లాక్కుని కడుపు కొట్టొద్దు

- బైపాస్ నిర్వాసితుల సమావేశం
- భూమి ధర పెంచాలని రైతుల పట్టు



నిర్వాసిత రైతుల సమావేశంలో మాట్లాడుతున్న డీటీ హరికిరణ్



సమావేశానికి హాజరయిన నిర్వాసిత రైతులు

శృంగవరపుకోట: మాకు జీవనాధారమైన భూములు లాక్కుని కడుపు కొట్టకండి. అడిగిన ధర ఇవ్వకుండా మా భూములు లాక్కుంటే మేం ఏం కావాలి. ప్రభుత్వమే భూములు లాక్కుంటామంటే ఎవరికి చెప్పుకోవాలంటూ నిర్వాసిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ–బొడ్డవర జాతీయ రహదారి 516బి రహదారి విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా మండలంలోని కొత్తూరు నుంచి కాపుసోంపురం వరకు కొత్తగా నిర్మాణం చేయనున్న బైపాస్ రహదారి ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డీవో సూచనల మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ల్యాండ్ అక్విజిషన్ డీటీలు కె. హరికిరణ్, ఎస్.కోట ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.భరత్‌కుమార్ గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీటీ హరికిరణ్ మాట్లాడుతూ రైతుల నుంచి భూమిని ఐదు కేటగిరిలుగా తీసుకుంటామని, ఎస్ఆర్ఓ నిర్ధారించిన మార్కెట్ ధర కన్నా రెండున్నర రెట్లు అధికంగా చెల్లిస్తామని చెప్పారు. ముందుగా అవార్డు ప్రకటించి, నగదు చెల్లించిన తర్వాత పనులు ప్రారంభిస్తారని రైతుల ప్రశ్నకు బదులు చెప్పారు. దీనిపై పలువురు రైతులు మాట్లాడుతూ ఐదు రెట్లు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం, స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలు ఫిబ్రవరిలో పెంచిన భూముల ధరల ఆధారంగా పరిహారం చెల్లించాలని కోరారు. దీనిపై డీటీ హరికిరణ్ బదులిస్తూ నోటిఫికేషన్ ఇచ్చే తేదీ నాటికి ఉన్న మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లిస్తామని, గజాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నా, ఎస్ఆర్ఓ రికార్డుల్లో గజాల్లో నమోదై ఉంటేనే గజాల్లో చెల్లింపులు చేస్తారని చెప్పారు. రెవెన్యూ రికార్డుల్లో యాజమాన్య హక్కులు ఉన్న వారికే చెల్లింపులు చేస్తారని చెప్పారు.

'పరిహారం పెంపు అధికారం లేదు

మేము జిల్లా అధికారులం కాదు. ఏమీ చేయలేం. మీ వినతులు జిల్లా అధికారులకు వివరిస్తాం అంటూ అధికారులు రైతుల డిమాండ్లకు బదులిచ్చారు. దీంతో రైతులు మాట్లాడుతూ నోటిఫికేషన్ ఇచ్చిన రోజు మాకు చెప్పి ఇచ్చారా? మా ఆస్తి తీసుకుని మా ఉపాధి లాక్కునేటప్పుడు మీ ప్రభుత్వాలు నిర్ణయించిన మార్కెట్ ధర అడిగితే ఇవ్వరా? ఇదెక్కడి న్యాయం, మా కుటుంబాలు ఏం కావాలి అంటూ భోరుమన్నారు. కొందరు రైతులు అధికారులకు దండాలు పెట్టి మాకు న్యాయం చేయండి, మా కడుపులు కొట్టకండి అంటూ మొరపెట్టుకున్నారు. రైతులు తమ అంగీకారం చెప్పకపోవడంతో అసంపూర్తిగానే సమావేశం అయ్యిందని పించారు. సమావేశంలో పలువురు రైతులు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 10 మేక పిల్లల మృత్యువాత



కుక్కల దాడిలో మృతి చెందిన మేక పిల్లలు

మెంటాడ: మండలంలోని లోతుగెడ్డ గ్రామంలో కర్రి అక్కయ్యకు చెందిన 10 మేక పిల్లలు కుక్కల దాడిలో మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అక్కయ్య పిట్టాడ గ్రామానికి మేకల మందను మేత కోసం తీసుకువెళ్లి మేక పిల్లలను గూడులో ఉంచాడు. ఆ గూడుపై కుక్కలు దాడి చేసి 10 మేక పిల్లలును చంపివేశాయి. మృతి చెందిన మేక పిల్లల విలువ సుమారు 50 వేల రుపాయలు ఉంటుందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు,

ఆయుష్‌శాఖలో సిబ్బంది కొరత

- హోమియో, ఆయుర్వేదం, యూనాని విభాగాల్లో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది అవసరం
- ఇబ్బందులు పడుతున్న రోగులు



విజయనగరంలో హోమియో విభాగంలో విధులు నిర్వహిస్తున్న కాంపౌండర్

విజయనగరం ఫోర్ట్: అల్లోపతి వైద్యం చేయించుకోవడానికి కొంతమంది ఆసక్తి చూపుతుండగా, మరి కొంతమంది ఆయుష్ వైద్యం పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే ఆయుష్‌శాఖలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది కొరత అధికంగా ఉంది. దీంతో రోగులకు వైద్యసేవలు పూర్తి స్థాయిలో అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి ఆయుష్‌శాఖ పరిధిలో హోమియో, ఆయుర్వేదం, యునాని, నేచురోపతి విభాగాలు ఉన్నాయి. జిల్లాలో కొన్ని చోట్ల హోమియో డిస్పెన్సరీలు ఉండగా, మరి కొన్ని చోట ఆయుర్వేదం డిస్పెన్సరీలు, యునాని, నేచురోపతి డిస్పెన్సరీలు ఉన్నాయి. వైద్యసిబ్బంది కొరత అధికంగా ఉన్నప్పటికీ కూటమి సర్కార్ ఖాళీలు భర్తీ చేయకుండా అలసత్వం వహిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

హోమియోలో 22 ఖాళీలు

హోమియో విభాగంలో 16 డిస్పెన్సరీలు ఉన్నాయి. 16మంది వైద్యులకు గాను 13 మంది ఉన్నారు. మూడు వైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాంపౌండర్లు 16 మందికి గాను ఆరుగురు మాత్రమే ఉన్నారు. 10 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్వీపర్‌కమ్ స్కావెంజర్ పోస్టులు 16 పోస్టులకు గాను ఏడుగురు ఉన్నారు. 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఆయుర్వేదంలో..

ఆయుర్వేదం శాఖలో 16 డిస్పెన్సరీలు ఉన్నాయి. 16మంది వైద్యుల పోస్టులకు గాను 15 మంది ఉన్నారు. ఒక వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉంది. కాంపౌండర్ పోస్టులు ఏడుకుగాను ఇద్దరు ఉన్నారు. ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏఎన్ఎం పోస్టులు 8కి గాను ఇద్దరు ఉన్నారు ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అటెండర్ పోస్టులు ఐదుకుగాను ఐదు ఖాళీగా ఉన్నాయి. నర్సింగ్ ఆర్డర్లీ ఏడుకుగాను నలుగురు ఉన్నారు. మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డిస్పెన్సరీ మూడు పోస్టులకు మూడు ఖాళీగా ఉన్నాయి. మెటర్నిటీ అసిస్టెంట్ ఒక పోస్టుకు గాను ఒక పోస్టు ఖాళీగా ఉంది

నేచురోపతిలో..

నేచురోపతి డిస్పెన్సరీలు మూడు ఉన్నాయి. ముగ్గురు వైద్యులకుగాను ముగ్గురు ఉన్నారు. కాంపౌండర్లు ముగ్గురికి గాను ఒక్కరే ఉన్నారు. రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నర్సింగ్ ఆర్డర్లీ పోస్టులు మూడుకు గాను ఇద్దరు ఉన్నారు. ఒక పోస్టు ఖాళీగా ఉంది.

యునానిలో..

యునాని డిస్పెన్సరీలు రెండు ఉన్నాయి. ఇద్దరు వైద్యులకు గాను ఒక్కరే ఉన్నారు. ఒక పోస్టు ఖాళీగా ఉంది. కాంపౌండర్ పోస్టులు రెండుకు గాను ఒక్కరే ఉన్నారు. ఒక పోస్టు ఖాళీగా ఉంది. స్వీపర్ కమ్ స్కావెంజర్ ఒక పోస్టుకుగాను ఒక్కరు ఉన్నారు.

ఆయుష్‌శాఖలో వివిధ వ్యాధులకు చికిత్స

ఆయుష్‌శాఖలో ఉన్న హోమియో, ఆయుర్వేదం, యునాని, నేచురోపతి విభాగాల ద్వారా వివిధ వ్యాధులకు వైద్యసేవలు అందిస్తారు. చర్మవ్యాధులు, పక్షవాతం, కీళ్లవాతం, నడుంనొప్పి, బీపీ, సుగర్, ఊబకాయం, సైనసైటిస్, ఆస్తమా, మూత్ర సంబంధిత, సొరియాసిస్, కామెర్లు తదితర వ్యాధులకు చికిత్స అందజేస్తారు.

సిబ్బంది కొరత వాస్తవం

ఆయుష్‌శాఖలో పారామెడికల్ సిబ్బంది కొరత ఉంది. ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలపై నివేదిక ఉన్నతాధికారుల వద్ద ఉంది.

డాక్టర్ జి.వరప్రసాద్, సీనియర్ హోమియో వైద్యాధికారి

సెంచూరియన్‌లో ఘనంగా జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవం



ప్రొఫెసర్ మహదేవ్ లాల్ ష్రాఫ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఔషధ విద్యకు పునాది వేసిన ప్రొఫెసర్ మహదేవ్ లాల్ ష్రాఫ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ ఈ ఏడాది ఫార్మా, ఫార్మసీ ప్రాక్టీస్‌లో వ్యవస్థాపక స్టార్టప్‌లు ప్రోత్సహించడమే ప్రధాన అజెండాగా ప్రభుత్వం పేర్కొందని, ఆ దిశగా విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు.

శిక్షణ ప్రారంభం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు సెంచూరియన్‌లో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యామ్‌ప్రసాద్ గురువారం ప్రారంభించారు. గ్రామీణ యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకువెళ్తున్నామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ, డీన్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.